క్లుప్తంగా

రేపు విద్యుత్‌కు అంతరాయం

కాజులూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపీ ఈపీడీసీఎల్ డీఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంట వరకూ కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, శీల, శీలలంక, ఒంటితాడి, పల్లిపాలెం విద్యుత్‌లైన్లలో గ్రామాలకు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.
రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ సబ్‌స్టేషన్ 11 కేవీ వెంకటాయపాలెం ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ శీలం యేసురాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటపేట, అన్నాయిపేట, వేగాయమ్మపేట, వెంకటాయాపాలెం, దాసరిపాడు, యల్లమ్మపంపు, చిన్నంపేట గ్రామాలకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు.
రాయవరం: మండలంలోని చెల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ విషయాన్ని రామచంద్రపురం ఈపీడీపీసీఎల్ ఈఈ వై.విజయానంద్ బుధవారం విలేకరులకు తెలిపారు. సబ్‌స్టేషన్ 11 కేవీఏ లైన్ నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. దాంతో చెల్లూరు, బత్తులవారి సావరం, చింతలతోట, మాచవరం, కృష్ణమ్మ చెరువు, పసలపూడి, నరాలవారిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు.

ఉపాధి పనుల గుర్తింపునకు 23 నుంచి గ్రామసభలు

మండపేట: ఉపాధి హామీ పనుల గుర్తింపు కోసం మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈ నెల 23వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో వీఎల్ ప్రసాద్ బుధవారం తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఈ గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సభలకు గ్రామస్తులు, మహిళా శక్తి సంఘాలు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయా మండల అధికారులు ఒక్కో సభను నిర్వహిస్తారని వివరించారు.

నేడు మెగా మేళా

మండపేట: తపాలా జీవిత బీమా, సేవింగ్స్, బ్యాంక్ ఖాతాలు, ప్రమాద బీమా తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం గురువారం పట్టణంలో మెగా మేళా నిర్వహిస్తున్నట్టు పోస్ట్‌మాస్టర్ ఎండీ సుబ్బారెడ్డి బుధవారం చెప్పారు. మెగా మేళాను స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న నాళం చిన భీమయ్య సత్రంలో గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమానికి ఏపీ సర్కిల్, పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ. శివనాగరాజు (విజయవాడ) హాజరవుతారని తెలిపారు. అలాగే రాజమండ్రి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు, రాజమండ్రి డివిజన్ పరిధిలోని పలువురు ఉన్నతాధికారుల హాజరవుతారని చెప్పారు. తొలుత పోస్టల్ పథకాలపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

కిసాన్ కార్డులతో రుణసాయం

- రైతులకు ప్రధాన మంత్రి కిసాన్ క్రెడిట్ కార్డు
- రూ.3 లక్షల వరకూ రుణ సదుపాయం
- ఇన్సూరెన్స్ సేవలూ పొందే వీలు
- పశు సంవర్ధక, మత్స్య రంగాల రైతులకూ ప్రయోజనం



కిసాన్ క్రెడిట్ కార్డు


మేడిశెట్టి కృష్ణార్జున, పశు వైద్యాధికారి, రామచంద్రపురం మండలం

రామచంద్రపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం రైతులకు పంట సాయం అందించేందుకు ప్రధాన మంత్రి కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ) పథకాన్ని అందుబాటులోనికి తెచ్చింది. ఈ పథకం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని రామచంద్రపురం మండల పశు వైద్యాధికారి డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున్ తెలిపారు. కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

పీఎం కిసాన్ స్కీం లబ్ధిదారులందరికీ..
కిసాన్ క్రెడిట్ కార్డులను పీఎం కిసాన్ స్కీం ప్రయోజనాలు పొందుతున్న వారందరికీ అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్డు ద్వారా రైతులు బ్యాంక్‌ల నుంచి రూ.1,50,000 నుంచి రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం పొందవచ్చు. ఈ రుణాలపై 7 శాతం వడ్డీ పడుతుంది. దీనిలో కేంద్ర ప్రభుత్వం 3 శాతం సబ్సిడీ అందిస్తుంది. దీని ద్వారా రైతులకు 4 శాతం వడ్డీకే రుణాలు లభిస్తాయి. గోల్డ్ లోన్‌పై వడ్డీ రాయితీని రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డుతో రైతుకు ప్రయోజనం చేకూర్చుతుంది. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు రుణాల కోసం మాత్రమే కాకుండా ఇన్సూరెన్స్ సేవలు కూడా కేంద్రం అందుబాటులోనికి తెచ్చింది. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాల ద్వారా తక్కువ ప్రీమియంతోనే జీవిత బీమా, ప్రమాద బీమా పొందొచ్చు. కిసాన్ క్రెడిట్ కార్డు కలిగిన రైతులకు కార్డుపైన ఉన్న లిమిట్ పెంచేందుకు ప్రయత్నించాలని బ్యాంకులను కేంద్రం కోరింది. కార్డులు లేకపోతే కొత్త కార్డులు జారీ చేయాలని పేర్కొంది. వ్యవసాయ రైతులకే కాకుండా పశు సంవర్ధక, మత్స్య రంగాలకు చెందిన రైతులకూ కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు అందించనున్నారు.

దరఖాస్తు చేసుకోండిలా..
కిసాన్ క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్, ఫోన్ వివరాలు కామన్ సర్వీస్ సెంటర్‌లో ఇవ్వాలి. దరఖాస్తు రుసుం చెల్లించాలి. రుణాలు పొందేందుకు రైతులు దరఖాస్తు ఫారాన్ని ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగా నింపి బ్యాంకులో అందించాలి. దరఖాస్తులో పండించే పంట, ఇన్సూరెన్స్, ఇదివరకు తీసుకున్న రుణాలు తదితర సమాచారం నింపితే సరిపోతుంది. కామన్ సర్వీస్ సెంటర్లలో కూడా ఈ ఫామ్ అందుబాటులో ఉంటుంది. www.pmkisan.gov.inలో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలి.

పాడి రైతులకు రూ.కోటి అందజేత
గడచిన ఆర్థిక సంవత్సరంలో రామచంద్రపురం, కె.గంగవరం మండలాల పరిధిలో పాడి రైతులకు రూ.కోటి వరకు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు అందజేశారు. ఈ ప్రక్రియ ఈ ఏడాదీ కొనసాగుతుంది. ఈ క్రెడిట్ కార్డులపై మంజూరు చేసిన రుణం సకాలంలో సక్రమంగా తిరిగి చెల్లించిన వారికే 3 శాతం ప్రభుత్వ సబ్సిడీ వస్తుంది. ఈ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

బీబీ ఉమ్మే కుల్సుమ్‌కు ఘన నివాళి


ద్రాక్షారామలో బీబీ ఉమ్మే కుల్సుమ్ పీరును గుర్రంపై ఊరేగిస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో ఇమామ్ హుస్సేన్ రెండో కుమార్తె బీబీ ఉమ్మే కుల్సుమ్ షహాదత్(వర్ధంతి) పురస్కరించుకుని ముస్లింలు ఘనంగా నివాళులు అర్పించారు. మత గురువు మౌలానా సయ్యద్ షబాబ్ హైదర్ జైదీ నక్షాలో మజ్లిస్ ఆలపించారు. ఉమ్మే కుల్సుం పంజా నుంచి బీబీ ఉమ్మే కుల్సుమ్ పీరును గుర్రంపై ఊరేగించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు.

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడి

కాజులూరు: వ్యవసాయంలో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులతో సాగు చేస్తే నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చని పెద్దాపురం రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ కె మాధవి అన్నారు. బుధవారం శీలలో మండల వ్యవసాయాధికారి వి.అశోక్ ఆధ్వర్యంలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో పెద్దాపురం రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ కె.మాధవి, కరప ఏడీఏ కె.బాబూరావు తదితరులు పాల్గొని ఎరువుల యాజమాన్యంపై రైతులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అవసరాన్ని మించి ఎరువులు, పురుగుమందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సేంద్రియ ఎరువులు వేప కాషాయం వంటివి వినియోగిస్తూ నాణ్యమైన దిగుబడి సాధించాలన్నారు. పురుగు మందులు అవశేషాలు లేని నాణ్యమైన ఉత్పత్తులను రైతు ఉత్పత్తి సంస్థ (ఎఫ్‌పీఓ)ల ద్వారా రైతులు అధిక ధరలకు విక్రయించుకోవచ్చని తెలిపారు. అనంతరం మానవాళిపై పురుగు మందుల విష ప్రభావాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు.


పొలంబడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఉపాధ్యాయ వృత్తితో సమాజం ప్రభావితం

ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

కపిలేశ్వరపురం: ప్రభుత్వ రంగంలో ఉపాధ్యాయ వృత్తి సమాజాన్ని ప్రభావితం చేస్తుందని ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వల్లూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల పీఎస్ హెచ్‌ఎం చల్లా వీరవెంకట సత్యనారాయణమూర్తి ఉద్యోగ విరమణ సత్కార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సత్యనారాయణమూర్తి, ధన మహాలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. 41 ఏళ్ల సుదీర్ఘ ఉపాధ్యాయ ప్రయాణంలో విలువలతో ముందుకు సాగడాన్ని సర్పంచ్ దాసి మీనాకుమారి, యూటీఎఫ్ నాయకులు, సహచర ఉపాధ్యాయులు ప్రశంసించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యాయ జేఏసీ కన్వీనర్ డీవీ రాఘవులు, జిల్లా అధ్యక్షులు పెంకే వెంకటేశ్వరరావు, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మ, జిల్లా సహాధ్యక్షులు పి.సురేంద్రకుమార్, మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శిలు జువ్వల శ్రీనివాస్, ఇల్లూరి సూరిబాబు పాల్గొన్నారు.



సత్యనారాయణమూర్తి సత్కారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

బంద్ విజయవంతం

మండపేట: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం మాల మహానాడు తలపెట్టిన భారత్ బంద్ మండపేట నియోజకవర్గంలోని కపిలేశ్వరపురం, రాయవరం, మండపేట మండల్లాల్లో విజయవంతమైంది. మండపేట, మండలంలోని కేశవరం, ఏడిద, ద్వారపూడి గ్రామాల్లో బంద్ పాటించారు. పట్టణంలోని పాతపేట, కొత్తపేట, న్యూ కాలనీ వీధుల్లోని మాలలు జెండాలు, ఫ్లెక్సీలు పట్టుకుని ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నినదించారు. పట్టణంలోని కేపీ రోడ్డు, మెయిన్ రోడ్డు, గుమ్మిలేరు రోడ్లలోని షాపులను మూసి వేయించారు. తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాలతో పాటు బ్యాంకులను కూడా వారు మూసి వేయించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేశారు. అలాగే కేశవరంలో ప్యాజింజర్ రైలు ఆగడంతో వెంటనే పట్టాలపైకి చేరుకుని రైలు రోకో చేశారు. మాల మహానాడు నాయకులు కనికెళ్ల ప్రసాద్, గంటా బాసి, బూరిగ జానీ, పాలమాల సత్తిబాబు, పిట్టా అర్జున్, సూకతట్టు కిషోర్, సన్నాల జాన్, బూరిగ శ్రీనివాసరావు తదితరులు బంద్‌కు సారథ్యం వహించారు.
కపిలేశ్వరపురం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, నల్లూరు, కపిలేశ్వరపురం తదితర గ్రామాల్లో బుధవారం మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేశారు. కాయకులు పాలింగి కృష్ణ కిశోర్, పీతల శ్రావణ్‌కుమార్, పాలింగి శ్రీనివాస్, రేలంగి శ్రీనివాస్, నక్కా సింహాచలం, సవిలే జయంత్, మొసలి శ్రీను, నేలపూడి శ్రీను, కపిలేశ్వరపురం సర్పంచ్ సాకా శ్రీనివాస్,కొండిపూడి రాజు, నీతిపూడి శేఖర్‌బాబు పాల్గొన్నారు.


మండపేట తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

కె.గంగవరం: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా చేపట్టిన బంద్ మండలంలో విజయవంతంగా జరిగింది. మండల పరిధిలోని పామర్రు, కె.గంగవరం తదితర గ్రామాల్లో దళితులు ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి, తహసీల్దార్ కె.సూర్యారావుకు వినతిపత్రాలు అందించారు. దళిత నాయకులు పెట్టా శ్రీనివాస్, బత్తుల అప్పారావు, తరపట్ల ఆనందరావు, ఇనకోటి శ్రీనివాసరావు, దారా సత్యనారాయణ, యంటపల్లి నాని పాల్గొన్నారు.
రామచంద్రపురం రూరల్: మండలంలో బంద్ సంపూర్ణంగా జరిగింది. మాల సామాజికవర్గ నాయకులు, యువకులు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ద్రాక్షారామ యానం సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనలు తెలిపారు. ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీస్, పారామిలటరీ బలగాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు.
కాజులూరు: మండలంలో ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. కాకినాడ, కోటిపల్లి రహదారిలో గొల్లపాలెం వైఎస్సార్ జంక్షన్ వద్ద, గొల్లపాలెం, యానం రహదారిలో కాజులూరు కృష్ణుడిగుడి జంక్షన్‌వద్ద మాలమహానాడు కార్యకర్తలు కొద్దిసేపు రాస్తారాకో నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల కన్వీనర్ పోలినాటి సూర్యచంద్రం, మండల ప్రధాన కార్యదర్శి రాజేష్, జల్లి సత్యనారాయణ, పోతు శ్రీనివాసు, పోతుల గనిరాజు, నిమ్మితి విజయ్, పోతురాజు బాబురావు, పోతురాజు బీమారావు, మాత స్వామి, జ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు.


ద్రాక్షారామలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

రాయవరం మండలంలో..
రాయవరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు రాయవరంలో బుధవారం బంద్ నిర్వహించారు. జైభీమ్ యూత్ నాయకులు పోలిమాటి సుధాకర్, నేతల సురేష్ నేతల రాజు, వింజిమల్ల సుధాకర్‌బాబు, పాలింగి రాజు, కచ్చా రాజశేఖర్, గొట్టి సూరిబాబు తదితరుల నాయకత్వంలో బంద్ పాటించారు. కార్యక్రమంలో కచ్చా విజయకుమార్, జిల్లెల్ల నాగేశ్వరరావు, గండి చంద్రశేఖర్, గొల్లపల్లి అర్జునరావు, చప్పల సుభాష్, పాలింగి శివ, మద్దాల ముఖేష్, పాలింగి దుర్గ తదితరులు పాల్గొన్నారు.వెంటూరు, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి తదితర గ్రామాల్లో బంద్ పాటించారు. గ్రామంలో బంద్ జరిగింది. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నున్న కృష్ణ ప్రదీప్‌కుమార్, దళిత నేతలు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో ఆట స్థలం


పి.మల్లవరంలో ప్రభుత్వ భూమిని కప్పేసి వేస్తున్న రహదారి, పక్కనే చేపట్టిన అక్రమ నిర్మాణం

- పరాధీనమవుతున్న పి.మల్లవరం జెడ్పీ హైస్కూల్ స్థలం
- ఎకరం భూమిలో అక్రమంగా కట్టడాల నిర్మాణం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

తాళ్లరేవు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఆటస్థలంలో ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. విద్యార్థుల భవిష్యత్ కోసం పాఠశాలకు కేటాయించిన భూమిని పలువురు ఆక్రమించుకుని నిర్మాణాలు సాగిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ సదరు పాఠశాల ఉపాధ్యాయులు గత ఆరు నెలలుగా మొత్తుకుంటున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నెలల తరబడి అధికారుల మొద్దునిద్ర వెనుక కొందరు నేతల హస్తం ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆరు నెలల క్రితమే ఫిర్యాదు
పి.మల్లవరం గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలకు 2021 మార్చి 20వ తేదీన సర్వే నెంబర్ 40/4లో నాలుగెకరాల గ్రామ కంఠం భూమిని కేటాయించారు. అక్కడ సుమారు మూడెకరాల్లో పాఠశాల భవనాలతో పాటు ఆట స్థలాన్ని ఏర్పాటు చేసి ప్రహరీ నిర్మించారు. అయితే ప్రహరీ అవతల మరో ఎకరం భూమి పల్లంగా ఉండడం, దాన్ని కప్పాలంటే భారీగా ఖర్చవుతుందన్న ఉద్దేశంతో అప్పట్లో అలాగే వదిలేశారు. పల్లం కావడంతో వర్షం నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తూ ఉండేది. ప్రస్తుతం అక్కడ ఎకరం రూ.50 లక్షలకు పైగా విలువ చేస్తుండడంతో సదరు భూమిపై స్థానికంగా కొందరు అక్రమార్కుల కన్ను పడింది. స్థలాన్ని కొద్దికొద్దిగా చదునుచేసి, శాశ్వత నిర్మాణాలు చేపట్టడం మొదలుపెట్టారు. పాఠశాల స్థలంతో పాటు అక్కడే కాలనీకి ఇచ్చిన స్థలంలో ఖాళీగా ఉన్న భూమిలోనూ నిర్మాణాలు చేపట్టారు. అది గమనించిన హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పాలెపు వెంకట శ్రీనివాసరావు 2024 ఫిబ్రవరి 26వ తేదీన పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. హైస్కూల్‌కు చెందిన భూములను పలువురు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, దీంతో సర్వే చేసి పాఠశాల భూమిని పూర్తిగా అప్పగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు నిర్మాణాలను నిలిపివేయాలని నోటీసులు జారీ చేసి మిన్నకుండిపోయారు.

ఆక్రమణల పర్వం మళ్లీ మొదలైంది
అప్పట్లో నోటీసులు ఇచ్చాక అక్రమార్కులు కాస్త వెనక్కి తగ్గినా ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ కట్టడాల నిర్మాణం ప్రారంభించారు. ముందు ఆక్రమిస్తే తరువాత పట్టాలు ఇప్పిస్తామంటూ కొందరు నేతలు హామీ ఇవ్వడంతోనే వారి అనుచరులు ఆక్రమణలకు పాల్పడుతున్నట్టుగా తెలుస్తుంది. పల్లంగా ఉన్న భూమిని మెరక చేసి ఇళ్ల నిర్మాణాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని పూడ్చి వేసి రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. ప్రభుత్వ స్థలంలో దర్జాగా రహదారి వేస్తుండడంతో కొందరు మరోసారి పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానికంగా ఉద్రిక్తత రేగుతుందన్న భయంతో పంచాయతీ అధికారులు జెడ్పీ హైస్కూల్ స్థలాన్ని సర్వే చేయాలంటూ తహసీల్దార్‌కు లేఖ రాశారు. అయితే స్థలాలు ఆక్రమిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ తెర వెనుక కొందరు నాయకులు ఒత్తిడి తీసుకొస్తున్నట్టుగా చర్చ సాగుతోంది. ఆక్రమణలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తహసీల్దార్‌కు లేఖ రాశాం
హైస్కూల్‌ను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల్లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను గతంలో నిలుపుదల చేశాం. ఇటీవల మాకు వచ్చిన ఫిర్యాదుల మేరకు మళ్లీ అక్కడ చేపట్టిన కట్టడాల నిర్మాణాలను వెంటనే ఆపుతాం. హైస్కూల్‌కు కేటాయించిన భూములకు సంబంధించి సర్వే చేయించాలని తహసీల్దార్‌ను కోరాం. సర్వే అనంతరం పాఠశాలకు కేటాయించిన పూర్తి భూమిని వారికి అప్పగిస్తాం.
– సూరంపూడి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి

సాయం అందేనా..!

- వరదల్లో పంటలు కోల్పోయిన రైతులు
- ఎనిమిది మండలాల్లో 1404 హెక్టార్లలో నష్టం
- పరిహారం కోసం ఎదురుచూపు


గోదావరి వరదకు నాశనమైన వంగతోట

మామిడికుదురు: గోదావరి వరద కూరగాయల రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది. ఎంతో కష్టపడి పండించిన కూరగాయల పంటలు తనలో కలిపేసుకుంది. పెట్టుబడి, శ్రమ అంతా నీటిలో తుడిసి పెట్టుకుపోయింది. వరద నీటిలో ముంపుబారిన పడిన పంటలు ఎండిపోయి, కుళ్లిపోయాయి. అరటి, బీర, బెండ, దొండ, వంగ, మునగ, బొప్పాయి, తమలపాకు తదితర రైతులకు తీరని నష్టం కలిగింది. నష్టపోయిన **రైతులు మళ్లీ పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎన్యూమరేషన్ పూర్తయింది. త్వరలోనే పరిహారం వస్తుందని అధికారులు** చెబుతున్నారు. జాప్యం లేకుండా వెంటనే పరిహారం అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

1404 హెక్టార్లలో పంట నష్టం
పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది మండలాల్లో కూరగాయల తోటలు గత నెలలో వచ్చిన వరదకు దెబ్బతిన్నాయి. రెండు నియోజకవర్గాల్లోను 144.94 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు నిర్ధారించారు. 4584 మంది రైతులకు నష్టం వాటిల్లింది. పి.గన్నవరం నియోజకవర్గంలో 3,369 మంది రైతులకు చెందిన 925 హెక్టార్ల విస్తీర్ణంలో పంట దెబ్బతింది. కొత్తపేట నియోజకవర్గంలో 1215 మంది రైతులు పండించిన 479.94 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు పాడైపోయినట్లు ఉద్యాన శాఖాధికారులు నివేదిక రూపొందించారు. తుది నివేదికను సిద్ధం చేసి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

రూ.80 వేలు పెట్టుబడి పెట్టా


ఎంతో కష్టపడి రెండెకరాల్లో మునగ పంట పండించా. రూ.80 వేలు వరకు పెట్టుబడి పెట్టా. పంట దిగుబడి వచ్చే సమయంలో గోదావరి వరద మొత్తం పంటను ముంచెత్తింది. మునగ తోట చనిపోయింది. దానిలోనే కూరగాయలు కూడా సాగు చేశా. అవి కూడా కుళ్లిపోయాయి. మంచి దిగుబడి వస్తుందని, ఆదాయం ఆశాజనకంగా ఉంటుందని ఆశిస్తే అంతా ఆడియాసలుగా మారాయి. నష్ట పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలి.
– కొమ్ముల వెంకటేశ్వరరావు, రైతు, పెదపట్నంలంక

పంట చేతికందే సమయంలో..


60 ఎకరాల్లో బొంత, కర్పూర అరటి పంట సాగు చేశా. పంట సాగుకు రూ.50 లక్షలు వరకు పెట్టుబడి పెట్టా. పంట ఎంతో చక్కగా ఎదిగింది. అరటి తోటలు గెలలు వేశాయి. పంట చేతి కందే సమయంలో గోదావరి వరద తోటలను ముంచేసింది. పది రోజుల పాటు వరద నీటిలో తోటలు మునిగి ఉండడంతో అంతా కుళ్లిపోయింది. నాతో పాటు చాలా మంది రైతులకు భారీగా నష్టం వచ్చింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి మమ్మల్ని ఆదుకోవాలి.
– నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రైతు, కె.ఏనుగుపల్లి

రూ.1.50 లక్షల నష్టం


పి.గన్నవరం మండలం తాటికాయలవారిపాలెంలో ఎకరం భూమి కౌలుకు తీసుకున్నాను. అర ఎకరంలో పచ్చిమిర్చి, అర ఎకరంలో మునగ పంట సాగు చేశాను. గోదావరి వరదకు రెండు పంటలు పాడైపోయాయి. ఈ పంటల సాగుకు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. పంట కోతకు వచ్చే దశలో గోదావరి వరద నన్ను నిలువునా ముంచింది. మంచి ఆదాయం వస్తుందనుకున్న సమయంలో గోదావరి వరద కనీసం పెట్టుబడి కూడా దక్కకుండా చేసింది. సహాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలి.
– వేమన పెద్దిరాజు, కౌలు రైతు, లంకలగన్నవరం

ఐదు ఖండాల్లో ఫ్రెంచ్ భాష


ఫ్రెంచి భాషపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధ్యక్షుడు సతీష్ నల్లా

యానాం: ప్రపంచంలోని ఐదు ఖండాల్లో సుమారు 300 మిలియన్ ప్రజలు ఫ్రెంచి భాషను మాట్లాడుతున్నారని, అత్యధికంగా మాట్లాడే భాషల్లో 5వ స్థానంలో ఫ్రెంచి ఉందని పుదుచ్చేరి ఫ్రెంచ్ కాన్సుల్ జనరల్ జీన్‌ఫిలిప్పీ హట్టర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గాజుల ఫంక్షన్ హాలులో ది అలయన్స్ ఫ్రాంకైజ్ ఆఫ్ పుదుచ్చేరి ఆధ్వర్యంలో యానాం రీజియన్ వారికి ఉచిత ఫ్రెంచి భాష ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఫ్రాన్స్ అధికార భాష ఫ్రెంచ్ భాష అని సరిహద్దు దేశాలైన బెల్జియం, జర్మనీ, స్విట్జర్లాండ్, ఇటలీ, అండోరా, స్పెయిన్‌లో సైతం ఫ్రెంచి మాట్లాడతారన్నారు. ఆయా దేశాల్లో ఉపాధి కోసం వచ్చే యువతకు ఈ ఆన్‌లైన్ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

విచారణ జరుగుతుండగా ఎన్నికలేంటి?

యానాం: యానాం కోపరేటివ్ స్టోర్స్‌లో జరిగిన అవినీతిపై విచారణ కొనసాగుతుండగా ప్రస్తుతం కోపరేటివ్ స్టోర్స్ కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించడంపై ఎల్జీ కె.కై లాష్‌నాథన్‌కు ఫిర్యాదు చేసినట్లు సోషల్ యాక్టివిస్ట్ మండపాక సత్తిబాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యానాం కోపరేటివ్ స్టోర్స్‌కు సంబంధించి మద్యం షాపుల నిర్వహణలో రూ.71,29,569 సొమ్ము పక్కదోవ పట్టిందన్నారు. సొసైటీకి సంబంధం లేని వ్యక్తి దానికి బాధ్యుడని విచారణలో తేలిందన్నారు. అనంతరం ఇద్దరు సభ్యుల బృందం తనిఖీ చేసి అవినీతి వాస్తవమేనని పుదుచ్చేరి రిజిస్ట్రార్ ఆఫ్ కోపరేటివ్‌కు నివేదికను ఇచ్చారు. 2018–21 మధ్య కాలంలో ఐఎమ్ఎఫ్ఎల్ విక్రయాల్లో జరిగిన అవినీతిపై 44 పేజీల విచారణ నివేదికను సైతం పంపారన్నారు. ఇందులో ఐఎమ్ఎఫ్ఎల్ సెక్షన్ ఇన్‌చార్జి, ఏడుగురు సేల్స్‌మెన్‌లు సొమ్ములు దుర్వినియోగం చేశారని తేలిందన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

అల్లవరం: మండలంలోని ఓడలరేవులో పిచ్చికుక్క స్వైర విహారం చేసి పలువురిని తీవ్రంగా గాయపరిచింది. మంగళవారం జరిగిన ఈ ఘటనలో ఏడుగురు పిచ్చికుక్క కాటుకి గురయ్యారు. మన్నా కాలనీలో ఒకరు, చేపల మార్కెట్ వద్ద ఐదుగురు, ఏటిమొగ వద్ద ఒకరిని పిచ్చి కుక్క కరిచింది. పిచ్చికుక్క దాడిలో గాయపడిన బాధితులకు స్థానిక సీహెచ్‌సీలో చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన కొల్లు ముత్యాలు ప్రస్తుతం అల్లవరం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడు.


పిచ్చికుక్క దాడిలో గాయపడిన ఓ మహిళ